విశాలాంధ్ర విలేకరిపై సర్పంచ్ కుమారుడు దాడి

అక్రమాలపై కథనాలు ప్రచురించడంతో అక్కసు

విశాలాంధ్ర విలేకరి రమణ

సర్పంచ్ కుమారుడు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రజా ప్రతినిధులుగా ఉండి ప్రజాసేవ చేయకుండా ఆ ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న ప్రజా ప్రతినిధుల ఆగడాలపై వార్తలు ప్రచురిస్తే తట్టుకోలేక విలేకరులపై దాడులు చేస్తున్న సంఘటనలు అనేకం చూస్తున్నాం. అయితే అలాంటి సంఘటనే పరవాడలో చోటుచేసుకుంది. విశాలాంధ్ర పరవాడ మండల విలేకరిగా పనిచేస్తున్న పల్లి వెంకటరమణ (శ్రీనివాస్) పెద ముసిడివాడ పంచాయతీలో జరుగుతున్న అక్రమాలు, సమస్యలపై కథనాలు రాస్తున్నారు. ఇది జీర్ణించుకోలేని వైసీపీ సర్పంచ్ కుమారుడు సోమవారం ఉదయం విధి నిర్వాహణలో భాగంగా పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామంలో పర్యటించేందుకు వెళ్లిన వెంకటరమణ పర్యటన అనంతరం తోటి విలేకరులతో పెదముషిడివాడ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ సమీపంలోకి రాగా రహదారికి అడ్డంగా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులతో(సుమారుగా 8మంది) పల్లా అప్పారావు (కబాడీ) వచ్చి దాడి చేశాడు. ద్విచక్ర వాహనం నుంచి కిందికి దించి ముఖంపైన, తలపైన పిడిగుద్దులు గుద్ది నువ్వు పెదముషిడివాడలో సమస్యల గురించి వార్తలు రాస్తే నిన్ను, నీ కుటుంబాన్ని లేపేస్తానంటూ హెచ్చరించారు. ఆయన వెంట వచ్చిన 8మంది వీడ్ని వదలకు చంపేయ్ అంటూ ప్రోత్సహించడంతో మరింత రెచ్చిపోయి బూతులు తిడ్తూ, నేను పెదముషిడివాడ సర్పంచ్‌ను నాకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే ఎవ్వడినైనా ఇంటికొచ్చి మరి చంపుతానంటూ మితిమీరిన కోపంతో రెచ్చిపోతూ ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. అనూహ్యంగా దారి కాసి విలేకరి వెంకటరమణపై పల్లా అప్పారావు దాడి చేయడంతో నిర్ఘాంతపోయిన తాను తేరుకొనేలోగానే కళ్ల అద్దాలు కిందపడిపోగా కాళ్లతో తొక్కి ధ్వంసం చేశాడు. అలాగే ఫోన్‌ను బలవంతంగా లాక్కొని విలువైన సమాచారాన్ని డిలీట్ చేశాడు. దాడి సంఘటనను మరో విలేకరి డి.మహేష్ చిత్రీకరించగా ఆతని సెల్‌ఫోన్‌ను సైతం లాక్కొని అప్పారావు చిత్రాలను డిలీట్ చేశాడు. డిలీట్ చేసిన ఫోన్‌ను మరో విలేకరి సునీలు ఇచ్చాడు. ప్రజా ప్రతినిధుల అక్రమాలపై వార్తలు రాస్తే ఇలా దాడులు దిగడం అన్యాయమని జర్నలిస్ట్ సంఘాలు ఖండించాయి. జరిగిన సంఘటనపై పరవాడ పోలీస్ స్టేషన్లోనూ, అనకాపల్లి డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు వెంకటరమణ తెలిపారు. వెంకటరమణపై దాడి చేసిన పల్లా అప్పారావు(కబాడీ)అయన అనుచరులపై తగు చర్యలు తీసుకొని ఆయన కుటుంబానికి తగు రక్షణ కల్పించాల్సిందిగా జర్నలిస్ట్ సంఘాలు కోరాయి.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర - పాయకరావుపేట: భార్య మీద అనుమానంతో కన్న కూతురు, కొడుకులను గొంతు నులిమి చంపిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ విశాఖపట్నం 12వ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు చెప్పినట్లు సిఐ పి.అప్పలరాజు తెలిపారు. మండలంలోని నామవరం గ్రామానికి చెందిన పాలిక సత్తిబాబు (35) తన భార్యపై అనుమానంతో తన కూతురు, కొడుకును గొంతు పిసికి చంపినట్లు వచ్చిన ఫిర్యాదుపై 2016 ఫిబ్రవరి 10 తేదీన సత్తిబాబుపై అప్పటి ఎస్సై ఎల్.రామకృష్ణ కేసు నమోదు చేసి సత్తిబాబును అరెస్ట్ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవానంద వాదనల మేరకు సత్తిబాబు హత్య చేసినట్లు రుజువు కావడంతో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష, 2 వేల రూపాయల జరిమానా విధించినట్టు తెలిపారు. జరిమానా కట్టలేని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష విధించాలని జడ్జి తీర్పు చెప్పినట్లు సీఐ అప్పలరాజు తెలిపారు.

గీతం డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న డిగ్రీ, పిజి కోర్సులలో ప్రవేశాలకు గాను అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. గీతంలో ఇంజనీరింగ్, ఎంబిఎ, బిబిఎ, బికామ్ మేనేజ్‌మెంట్ కోర్సులకు లా, ఆర్కిటెక్చర్, మెడికల్, ఫార్మశీ, ఫిజియోథెరపి వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు ఎమ్మెస్సీ, బిఎస్సి, బిఎ, ఎమ్ఎ డిగ్రీ కోర్సులకు ఈ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారికి బిఎస్సీ బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటస్టిక్స్, బిసిఎ, ఫిజియోథెరపి, బిఫార్మశీ తో పాటు బిఎ ఎల్ఎల్‌బి, బిబిఎ, బిఎ లో ఎకనామిక్స్, హిస్టరి, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజి కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హెటిరో ఉద్యోగి ఆత్మహత్య

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో సోమవారం నక్కపల్లి హెటిరో పరిశ్రమలో జె-2 బ్లాక్‌లో షిఫ్ట్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న బట్టా రామ గోవింద సత్య చంద్రశేఖర్ (42) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే నర్సీపట్నం శివపురం చెందిన బట్టా గోవింద సత్య చంద్రశేఖర్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా స్థానిక హెటిరో ఔషద పరిశ్రమలో గత 14 ఏళ్ళ నుండి పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి డ్యూటి వచ్చి, తన బ్లాకులో వారితో పనిచేస్తు, తెల్లవారుజాము నుంచి కనిపించకపో వడంతో, వెళ్లి వెతకగా సమీపంలో ఉన్న షెడ్డుకు ఉరేసుకున్నట్లు గుర్తించారు. కొన ఊపిరితో ఉన్న చంద్రశేఖర్‌ను కంపెనీ అంబులెన్స్‌లో నక్కపల్లి హాస్పటల్‌కు తీసుకొనిరాగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ శిరిషా, సిఐ అప్పన్న సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మజ్జివలస పీఏసీఎస్ సొసైటీలో మజ్జివలస గ్రామానికి చెందిన గాదపిల్లి పాపారావు, గాదిపిల్లి నారాయణ ఇరువురు సభ్యులు గత కొద్దిరోజులు క్రితం అనారోగ్యంతో మరణించినందున కుటుంబ సభ్యులకు భీమా నష్ట పరిహారం క్రింద ఒక్కొక్కరికి రూ 15 వేలు చొప్పున ఇన్సూరెన్స్ చెక్కులను మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు బోని బంగారునాయుడు, మజ్జివలస పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లూరు పైడప్పడు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్స్ గాడు తాతినాయుడు, తుపాకుల అప్పలస్వామి, మజ్జివలస గ్రామ సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, సొసైటీ కార్యదర్శి గల్లా రామకృష్ణ, డోప్ప ఎర్రయ్య, మజ్జివలస సచివాలయం కన్వీనర్ కొయ్య రామకృష్ణ పాల్గొన్నారు.

అవగాహన లేని నాయకులు, అధికారులతో ఇక్కట్లు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోనల్ ఆఫీస్ పరిధిలోని గత మూడు సంవత్సరాలుగా వాటర్ సప్లై పైపులైన్లు లీకులతో రోడ్లను తవ్వేసి నిరంతరం మరమ్మతులు చేస్తూనే ఉన్నారని తవ్వివదిలేసిన గోతుల్లో ప్రజలు పడిపోయి ఆసుపత్రి పాలవు తున్నా రని టీడీపీ పార్లమెం టరీ సెక్రటరీ పిట్ట సురేష్ అన్నారు. కొత్తపేట నుండి గణేష్ థియేటర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో కొండపేట శివాలయం ముందర పైపులైను లీక్‌తో నీరు నిరంతరం నిల్వ ఉండటం కారణంగా దుర్వాసనతో పాటుగా క్రిములు, దోమలు చేరుతున్నాయన్నారు. ఇక్కడ అంగన్వాడీ భవనం, ఎలిమెంటరీ స్కూలు, బాలికల హాస్టల్, బాలికల ఉన్నత పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాలలు ఉన్నాయని, చుట్టూ ఉన్న కాలనీ నివాసితులు, గుడివాడ వైపు వెళ్లే ప్రజలు, ఉద్యోగులకు ఒకే ఒక్క రహదారి అన్నారు. చాలా ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ పోల్స్ పక్కన పైపు రిపేర్ కోసం త్రవ్వి వదిలేసిన గోతులు ఎన్నో ఉన్నాయన్నారు. నాయకులు స్థానిక సమస్యల పట్ల దృష్టి పెట్టకపోవడం, అధికారుల నిర్లక్ష్యం, రిపేర్లు చేయడానికి సామర్థ్యం గల సిబ్బంది లేకపోవడమేనన్నారు. ఇటువంటి నిర్లక్ష్య పనులపై దృష్టిసారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని సి.ఆర్ మీడియా అకాడమీ ఆఫ్ ఏపీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు కొనియాడారు. సోమవారం 'అవర్ స్టేట్ అవర్ లీడర్'లో భాగంగా "సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం" అనే అంశంపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకెళ్లే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను తమిళనాడు ప్రభుత్వం కూడా అమలు చేసేందుకు సిద్ధమైందన్నారు. వలంటీర్ల వ్యవస్థను మెచ్చుకున్న కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఇలాంటి వ్యవస్థనే తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శాంత మూర్తి, నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ వి.సి వి.బాల మోహన్ దాస్, జాయింట్ డైరెక్టర్ ఎ.పి ఇన్నోవేషన్ సొసైటీ లావణ్య, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావు, యాక్సిస్ సెవెన్ ఇకోస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పాల్ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడిని ఖండించిన జర్నలిస్ట్ సంఘాలు

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ విశాలాంధ్ర విలేకరి పల్లి వెంకటరమణపై అమానుషంగా దాడి చేసిన పెదముసిడివాడ గ్రామానికి చెందిన పల్లా అప్పారావు అతను అనుచరులు ఎనిమిది మందిపై పరవాడ పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. విలేకరిపై దాడి చేసిన పల్లా అప్పారావు గ్యాంగ్‌పై చర్యలు కోరుతూ జర్నలిస్ట్ సంఘాలు పరవాడ పోలీసులను, జిల్లా ఎస్పీని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. విశాలాంధ్ర విలేఖరి పల్లి వెంకటరమణ విధుల్లో భాగంగా పెదముసిడివాడ బైక్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో వాహనాన్ని ఆపి అతనిపై అమానుషంగా దాడి చేశారు. వార్తలు రాస్తే విశాలాంధ్ర దినపత్రిక విలేకరినీ, అతను కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరించడం పట్ల విలేకరి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విలేకరిపై దాడికి పాల్పడిన పల్లా అప్పారావు, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని సంఘాలు కోరుతున్నాయి.

బాలుడు అదృశ్యం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పోలీస్ స్టేషన్ సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాల మేరకు నేర్లవలస గ్రామానికి చెందిన బొట్ట అప్పలనాయుడు కుమారుడు బొట్టా మౌళి (16) ఆదివారం రాత్రి ఒంటి గట సమయం నుంచి ఇంటి నుండి వెళ్లిపోయినట్లుగా ఫిర్యాదు అందింది. బాలుని ఎత్తు ఐదున్నర అడుగులు అని చామచాయి కలిగి ఉంటాడని ఇంటి నుంచి వెళ్ళిపోయినప్పుడు బ్లాక్ షర్ట్, బ్లాక్ ట్రాక్ బట్టలు ధరించాడని ఫిర్యాదులో తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును సీఐ మిస్సింగ్ కేసుగా నమోదు చేసి సీఐ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ కన్నారావు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ తలపెట్టిన బస్సు యాత్రకు నీరాజనాలు

విశాలాంధ్ర - చింతపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేసేందుకు సీపీఐ తలపెట్టిన ప్రచార జాత బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా చింతపల్లిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆ పార్టీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దీసరి బిమలమ్మ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ఈ కార్యక్రమానికి అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్వయంగా బస్సు యాత్రకు నాయకత్వం వహిస్తూ 26 జిల్లాలలో బస్సు యాత్ర నిర్వహిస్తుండడంతో అధికార పక్షాలలో భయం మొదలైందన్నారు. ఎవరు ఎన్ని ఆటంకాలు కలిగించినా అశేష జన వాహిని తరలి రావడంతో బహిరంగ సభ విజయవంతం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.విమల, కార్యవర్గ సభ్యురాలు కె.విమల, సీపీఐ అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, పొట్టిక సత్యనారాయణ, సీపీఐకి చెందిన అంజలి శనివారం సర్పంచ్ పేట్ల రాజుబాబు, ఎర్ర బొమ్మల ఎంపీటీసీ ఎస్.సత్తిబాబు, చింతపల్లి, జీకే వీధి మండల కార్యదర్శులు పేట్ల పోతురాజు, కంకిపాటి సత్తిబాబు, నాయకులు గంజారి రమణ, మఠం సూరి పడాల్, గెమ్మేల కుజ్జన్న, అరిగల అప్పలనాయుడు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం గంగవరం పోర్టు నిరసన దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపింది. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పైడిరాజు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు కోసం పోర్టు కార్మికులు 47 రోజులుగా దీక్షలు చేస్తున్నా అదానీ పోర్టు యాజమాన్యానికి చీమ కుట్టినట్టయినా లేదన్నారు. చాలీ చాలని జీతాలతో పోర్టు కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. తక్షణమే అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం స్పందించి కనీస వేతనాలు అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, క్షేత్రపాల్, రెహమాన్, నాయకులు వై.నందన్న, జి.ఆనంద్, కె.అచ్యుతరావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయండి

సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

విశాలాంధ్ర - కొయ్యూరు: పరదేశి పాకలు గ్రామంలో ఈనెల 23న నిర్వహించనున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సీపీఐ కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ కోరారు. బంగారంపేట పంచాయతీ పరదేశిపాకలు గ్రామంలో నిర్వహించే ఈ మహా సభలకు జిల్లా నుండే కాక ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన సీపీఐ రైతు సంఘం గిరిజన సమాఖ్య నేతలు హాజరు కానున్నారన్నారు. ఇటీవల మండలంలో జరిగిన వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు సంబంధించి రేవళ్లు పి.మాకవరం పంచాయతీలలోని వార్డు సభ్యులను అధికార వైసిపి గెలుచుకోవటం విశేషమేమీ కాదన్నారు. ఉప ఎన్నికల్లో ఎక్కడ సిపిఐ పార్టీ ఎన్నికల బరిలో దిగకపోవటం వల్లే అధికార పార్టీ సభ్యుల విజయం సుగమమైందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేత కనకరాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అరెస్ట్ దుర్మార్గం

ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎస్ భద్రం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అపరిష్కృత సమస్యలు పరిష్కారానికి విజయవాడలో ధర్నా చేపట్టి నిరసన తెలియజేయాలని ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా విజయవాడ బయలుదేరిన ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్‌ను, నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం, గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వై.ఎస్.భద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, అలాగే వారికి ఆరోగ్య బీమా కల్పిస్తానని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. యలమంచిలిలో అక్రమంగా అరెస్టు చేసిన మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఏసుదాసు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. వెంటనే వారిని విడుదల చేసి విజయవాడ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని భద్రం కోరారు.

అగనంపూడి టోల్‌గేట్ వెంటనే ఎత్తివేయాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: అగనంపూడి టోల్‌గేట్ వెంటనే ఎత్తివేయాలని కోరుతూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో అగనంపూడి టోల్ గేట్ వద్ద నిరసన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ ఈ టోల్ గేట్‌ను ఎత్తివేయడానికి కృషి చేయవలసిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించక పోవడం అన్యాయమన్నారు. టోల్ గేట్ యాజ మాన్యంతో లాలూచీ పడుతోందని దుయ్యబట్టారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు వారి వ్యాపారాలు, వ్యవహారాల పట్ల ఉన్న శ్రద్ధ ఈ సమస్య పట్ల ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష టీడీపీ ఈ సమస్యపై ప్రేక్షక పాత్ర వహిస్తోందన్నారు. గతంలో హైకోర్టు టోల్ గేట్ ఎత్తివేయాలని తీర్పు చెప్పిందని దీనిపై టోల్ గేట్ యాజమాన్యం సుప్రీంకోర్టుకెళ్ళి స్టే తీసుకొచ్చిందని, సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అనకాపల్లి నుండి ఆనందపురం వరకు ఆరులైన్ల రోడ్డు పూర్తయిన వెంటనే ఈ టోల్ గేట్ ఎత్తివేస్తామని కోర్టుకు తెలిపిందని ఆరు లైన్ల హైవే పూర్తయినా నేటివరకు ఈ టోల్ గేట్ ఎత్తి వేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం స్టీల్ జోన్ కార్యదర్శి పివిబిఎస్ శ్రీనివాసరాజు, సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఎం వార్డు కార్పోరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఎం నాయకులు మరిడయ్య, అయోధ్యరామ్, రామస్వామి, ఎన్ రామారావు, సీపీఐ నాయకులు రెహమాన్, రామకృష్ణ, అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ట్రాన్సు పోర్టు అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, శనివాడ కాలనీ అసోసియేషన్ నాయకులు సిహెచ్ నారాయణరావు పాల్గొన్నారు.

తర్లువాడ కొండపై విద్యాసంస్థలా...?

విశాలాంధ్ర - ఆనందపురం: ఎంతో ఆహ్లాదకరమైన ప్రకృతి పర్యావరణాన్ని నాయకులు అండదండలతో నాశనం చేస్తున్నారు. సుమారు 30 ఎకరాల కొండ భాగం పైన బడాబాబులు అండదండలతో కారు చౌకగా విద్యాసంస్థల పేరుతో తర్లువాడ కొండపై సర్వేనెంబర్ 1లో సుమారు 300 కోట్లు విలువైన భూమిని ప్రభుత్వం కబ్జా చేస్తుందని, చుట్టుపక్కల సుమారు 20 గ్రామాల ప్రజలు పాడి పరిశ్రమకు అండదండగా ఉండే ఈ కొండను నాశనం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వం కన్నేసిందని జనసేన నాయకులు పేర్కొన్నారు. కనీసం స్థానిక నాయకులకు కూడా సమాచారం ఇవ్వకుండా రాజ్యసభ సభ్యులు ఎంపీ విజయసాయిరెడ్డి నేరుగా వచ్చి కొండను తనిఖీ చేశారని అన్నారు. విద్యా సంస్థల పేరుతో 300 కోట్లు రూపాయల అతి విలువైన కొండను కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. గతంలో విష్ణుమూర్తి పాదాల విగ్రహాలు గ్రామస్తులు కొండపైన నిర్మించాలని తొలుత విష్ణుమూర్తి పాదాలు ఇక్కడ వెలిసాయని అలాగే కొండపైన 10 ఎకరాలు స్థలాన్ని చదును చేశారని, కొండ నుండి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గ్రేహౌండ్స్ బెటాలియన్ బలగాలు ఉన్నాయని అన్ని విధాలుగా అనుకూలంగా ఉండే ఈ స్థలంపై నాయకుల కన్నుపడిందని అన్నారు. ప్రకృతిని నాశనం చేస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మజ్జ శ్రీను, ఎక్స్ ఆర్మీ నాగరాజు పాల్గొన్నారు.

అడ్డురోడ్డులో భారీ వర్షం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో వ్యాపార ముఖ్య కేంద్రమైన అడ్డురోడ్డులో భారీ వర్షం కురిసింది.

సోమవారం సాయంత్రం ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు ఏర్పడి వర్షం ప్రారంభమైంది. వర్షం భారీగాలితో సుమారు గంట పైగా కురిసింది. గత నాలుగు రోజులుగా కాస్తున్న తీవ్రమైన ఎండలు ఈ వర్షంతో ప్రజలకు, రైతులకు కాస్త ఉపశమనం కలిగింది.

విస్తరణ రోడ్డు ఆక్రమణలు తొలగించండి

స్పందనలో సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రజా అవసరాలకు అవసరమైన రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే శంకుస్థాపన చేసిన రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ సోమవారం స్పందనలో మేయర్‌ను కోరారు. గాజువాక జోన్ 5లో చైతన్య నగర్, సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు కేశినేని ట్రావెల్స్‌కు మధ్య ఉన్న 15 అడుగుల రోడ్డును సీసీ రోడ్డు నిర్మాణానికి ఈ నెల 4న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఆ వార్డు కార్పొరేటర్ ఏజే స్టాలిన్‌తో పాటు మరికొంతమంది పెద్దలు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. జాతీయ రహదారి నుండి అశోక్ చౌదరి ఇంటి వైపు చలపతి స్కూలుకు వెళ్లే రహదారి హైవే పక్కన ఉన్న 15 అడుగుల రోడ్డుని ఆక్రమించారని, ఈ ఆక్రమణ ఎవరు చేశారో తెలుసుకుని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చైతన్య నగర్, గాజువాక వాసులకు ఎంతో దోహదపడిన ఈ రోడ్డు విస్తరణ పనులు చేయడంలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.

దేశ సాధికారత దిశగా ఎన్ఎస్‌టీఎల్

విశాలాంధ్ర - సింహాచలం: స్థానిక నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ (ఎన్.ఎస్.టి.ఎల్)లో 54వ ల్యాబ్ రైజింగ్ డే జరిగింది. 1969న 10 మంది సిబ్బందితో స్థాపించబడిన ఎన్ఎస్‌టీఎల్‌లో ప్రస్తుతం 172 మంది శాస్త్రవేత్తలతో సహా 612 మంది సిబ్బందితో అనేక రెట్లు పెరిగింది. ముఖ్య అతిథి విశిష్ట శాస్త్రవేత్త డా. వై.శ్రీనివాసరావు దేశ సాధికారత దిశగా 54 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నందుకు టీమ్‌ను అభినందించారు. ఎన్ఎస్‌టీఎల్‌పై భారత నావికాదళం మాత్రమే కాకుండా దేశం మొత్తం చాలా ఆశలు పెట్టుకుందని ఆయన అన్నారు.

పాస్టర్ల శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మణిపూర్ ఘటనను నిరసిస్తూ మండల కేంద్రమైన దుంబ్రిగుడలో మండల పాస్టర్ల ఫెలోషిప్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గల పాస్టర్లు, క్రైస్తవ భక్తులు హాజరై శాంతి ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇక్కడి క్రైస్తవ చర్చి ప్రాంగణం నుంచి ప్రధాన రహదారి మీదుగా దుంబ్రిగుడ లోని మూడు రోడ్ల జంక్షన్ వరకు శాంతి ర్యాలీ కొనసాగించి పాస్టర్ల సంఘ ప్రతినిధులు మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం బాధాకరం అన్నారు. క్రైస్తవులపై దాడులను నిర్వహించడంతోపాటు మహిళలపై హింసాత్మక చర్యలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు కన్వీనర్ హెచ్‌బీ జాన్ విన్సెంట్, ప్రెసిడెంట్ వి.కృష్ణదాస్, గౌరవ అధ్యక్షులు బి.మహేష్, సంఘ వ్యవస్థాపకులు జి.జాన్, కార్యదర్శి సునీల్, ట్రెజరర్ ఎం.తిమోతి, మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి, అల్లూరి సీతారామరాజు జిల్లా హెచ్‌ఆర్‌సి అధ్యక్షుడు పి.ధర్మ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలం కోనాపురం రోడ్డు బొర్ర గేటువలస నుండి లోతేరు రోడ్డు కరాయిగుడ జంక్షన్ వరకు అధ్వాన్నంగా ఉన్న రహదారి మరమ్మతులు చేపట్టాలని జెడ్పీటీసీ దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. 10 కిలో మీటర్ల మేరకు రహదారి అధ్వాన్నంగా వుందన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంచడి కృష్ణ, కిల్లో రాజు, వార్డు మెంబర్ జన్ని బాబురావు, వార్డు మెంబర్ కిల్లో కొండప్ప, బస్కిబారికి, విజయరావు తడబారికి అప్పలరాజు, కిల్లో దానియలు, జన్ని జగన్నాథం, పూజారి మంగ్ల తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ స్పందించాలి



విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ అధికారులు అండదండలతో ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ శాఖ నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం విచారకరమని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు నేరుగా మండల తహశీల్దార్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ రెవిన్యూ శాఖ భూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తుండడంతో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ప్రభుత్వ పథకాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనుల విషయమై ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం సభ్యులు ముక్తకంఠంతో అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ 1 సత్యనారాయణ, సిర్గం భాగ్యవతి, ఎంపీడీవో ఆర్వీఎస్ రమేష్, జీసీసీ మేనేజర్ సిహెచ్ మోహన్‌రావు, వైద్యాధికారుడు రమేష్, శ్యాం ప్రసాద్, పీఆర్ఏ ఈఈ గోపాలకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాల సతీష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ (సంజూ బాబు) పుట్టినరోజు వేడుకలు సోమవారం పట్టణంలోని నరసింగరావు పేటలో గల వారి గృహం వద్ద ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు వేడుకలలో భాగంగా కోలాటం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అనకాపల్లి స్థానిక నూకాలమ్మ అమ్మవారిని కుటుంబ సమేతంగా వెళ్లి దర్శించుకున్నారు. అనకాపల్లి ఉపకారాగారం కేంద్రంలో ఖైదీలకు పళ్ళు, రొట్టెలతో పాటు ఫ్యానులు వితరణ చేశారు. అనంతరం నెహ్రూ చౌక్ వద్ద నుండి, సంజయ్ యువసేన సభ్యులు ఆధ్వర్యంలో 200 బైకులతో ర్యాలీగా, ముత్యాల వెంకటేశ్వరరావు నివాసం వద్దకి వచ్చారు. ఈ మేరకు ముత్యాల వెంకటేశ్వర కుటుంబం సమేతంగా సతీష్ బాబు కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, అభిమానులు, యువ సేన సభ్యులు పాల్గొన్నారు.

సీలేరు నైట్ హాల్ట్ బస్సు ప్రారంభం

విశాలాంధ్ర - సీలేరు: మధురవాడ సీలేరు నైట్ హాల్ట్ బస్ సర్వీసును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ అనురాధ తెలిపారు. మధురవాడ నుంచి బయలుదేరి వయా విశాఖపట్నం, నర్సీపట్నం, చింతపల్లి మీదుగా సీలేరుకు ఈ బస్సు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ బస్సు ప్రతీ రోజూ మధ్యాహ్నం 2 గంటలకు మధురవాడ డిపోలో బయలుదేరి 3 గంటలకు విశాఖపట్నం కాంప్లెక్స్, రాత్రి 9.45 గంటలకు సీలేరు చేరుకుంటుందని తెలిపారు. ఇక్కడ నైట్ హాల్ట్ ఉండి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సీలేరులో బయలుదేరి మధురవాడ మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రయాణికులు ఈ బస్ సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కక్షసాధింపు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: దళితులమైన తమపై కక్షసాధింపు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాకవరపాలెం మండలం వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన కిల్లాడ లక్ష్మీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తమకు జరిగిన అన్యాయంపై గత ఏడాది పోలీసులకు ఫిర్యాదు చేశామనే కారణంగా స్థానికంగా ఉన్న అగ్రవర్ణాల వారు ఇబ్బందులకు గురి చేస్తూ గ్రామ బహిష్కరణ చేసేందుకు చూస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది.

పాడేరు ఘాట్ రోడ్‌లో బస్సు ప్రమాదం బాధాకరం

విశాలాంధ్ర - చింతపల్లి: పాడేరు ఘాట్ రోడ్‌లో బస్సుప్రమాదం జరగడం బాధాకరమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. ఆ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ఘటనలో గాయపడిన భాదితులను సోమవారం ఆయన విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాద వివరాలను బాధితులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయలు, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి ఐదు లక్షల రూపాయలు, గాయపడిన వారికి లక్ష రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మానవత్వం చాటుకున్నారన్నారు. మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్ర బంధం నుంచి శరబన్నపాలెం వెళుతూ ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చింతపల్లి మాజీ శాసనసభ్యుడు గొడ్డేటి దేముడు కుమారుడు, ప్రస్తుత అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి సోదరుడు గొడ్డేటి మహేష్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సంక్షేమ హాస్టల్, కళాశాల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: సంక్షేమ హాస్టల్, కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని నాయుడు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సంఘర్షణ సైకిల్ యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ బాలురు, బాలిక వసతి గృహాలను సందర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేఘాద్రి అంబేద్కర్ గురుకులం పాఠశాలను సందర్శించి అక్కడున్న సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాయుడు మాట్లాడుతూ ఈనెల 19న

భీమిలిలో ప్రారంభమైన యాత్ర గాజువాకలో ముగిస్తుందని తెలిపారు. ప్రభుత్వ బాలుర, బాలిక వసతి గృహాల్లో అనేక సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, ప్రభుత్వం నాడు నేడు ను అద్దంలో చూపించి ఎక్కడి సమస్యలు అక్కడే వదిలేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్యాన్లు కూడా లేవని అలాగే ఇంతవరకు పాఠ్యపుస్తకాలు అందలేదని అసహనం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 77 తెచ్చి పీజీ విద్యార్థులకు విద్యాదీవెన ఇవ్వకుండా ఉన్నత చదువులకు వెళ్లకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. జీవో నెంబర్ 107, 108 తెచ్చి వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తోందని విమర్శించారు. రానున్న రోజుల్లో ఈ సమస్యలపై భారీ ఎత్తున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అధైర్య పడకండి... అండగా ఉంటాం

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి: పాడేరు ఘాట్ రోడ్లో ఆదివారం చోటు చేసుకున్న బస్సు ప్రమాద ఘటనలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు, ప్రభుత్వం అండగా ఉంటుందని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. బస్సు ప్రమాదంలో గాయపడి వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రమాదం జరిగిన వెంటనే, అదేవిధంగా సోమవారం కూడా ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అధైర్య పడకుండా వైద్యం పొందాలని, త్వరగా కోలుకునే దిశగా వైద్యులు కృషి చేయాలని చెప్పారు. బాధితులంతా కోలుకునేంత వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని ఆమె తెలిపారు.

జాతీయ ఆటల పోటీలకు ఆదర్శ్ విద్యార్థిని కుసుమశ్రీ

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో బి.ఎస్.సి డేటా సైన్స్ చదువుతున్న విద్యార్థిని కుసుమశ్రీ "స్కయ్ మార్షల్ ఆర్ట్" జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎన్.ఇ ఫ్లోరా తెలియజేసారు. శ్రీకాకుళంలో ఈ నెల 13న జరిగిన రాష్ట్ర స్థాయి "స్కయ్ మార్షల్ ఆర్ట్" పోటీలలో రెండు బంగారు పతకాలు సాధించిందని తద్వారా గోవాలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. సోమవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల కరెస్పాండెంట్ టి. థియఫిలస్ కుసుమశ్రీని సత్కరించారు. జాతీయ పోటీలలో కూడా బంగారు పథకాలు సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాల్బన్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రవిబాబు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణరాజుపేటలో పొలంబడి

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం నారాయణరాజుపేట గ్రామంలో పీలా అరుణ్‌ఖుమార్ రైతు పొలంలో మండల ఇన్‌చార్జ్ కవిత ఆధ్వర్యంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 1ఎన్టు 1 స్క్వేర్ మీటర్లలో 33 దుబ్బులు రావడం జరిగిందని, పొలంలో పక్షి స్థావరాలు, పసుపుపల్లెలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లింగాకర్షక బుట్టలు కూడా పెట్టించి రైతులకు వీటి యొక్క ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇ.సుదర్శన్, అప్పారావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించి బిల్డర్ల నిర్మాణాలు

టౌన్ ప్లానింగ్ విభాగం చర్యలు శూన్యం

స్పందనలో బొడ్డేడ గంగాధరు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జీవీఎంసీ పరిధిలో గల స్థానిక 81వ వార్డు జగన్నాథ్ థియేటర్ సమీపంలో బి.వి.ఆర్ రామ్ నివాస్ పేరుతో నిర్మిస్తున్న భవనం బిల్డర్లు టౌన్ ప్లానింగ్ నిబంధనలు అతిక్రమించి నిర్మాణం చేపడుతున్నారని బొడ్డేడ గంగాధరు ఆరోపించారు. ముందుగా ఆయన సోమవారం ఉదయం జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఇన్చార్జి కమిషనర్ చక్రవర్తిని కలిసి ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. అనంతరం బొడ్డేడ గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ స్థానిక 81వ వార్డు జగన్నాథ థియేటర్ రోడ్డులో బిల్డింగ్ యజమానులు బొడ్డేడ ధనలక్ష్మి భర్త రామప్పలనాయుడు చేపడుతున్న బి.వి.ఆర్ రామ్ నివాస్ పేరుతో నిర్మిస్తున్న బిల్డింగ్ టౌన్ ప్లానింగ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. అంతేకాకుండా భవన నిర్మాణాల యాక్ట్‌కి విరుద్ధంగా 30 అడుగులు ఉండవలసిన రహదారి 23 అడుగులు వెడల్పు ఉన్నచోట టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డింగ్ కి ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. బిల్డింగ్ అనుమతులు చెల్లించవలసిన లక్షల రూపాయలు ఓపెన్ చెస్ టాక్స్ ఎగ్గొట్టిన కనీసం జీవీఎంసీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని అన్నారు. అక్రమ కట్టడాలపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి నోటీసులు ఇచ్చినప్పటికీ యదేచిగా నిర్మాణ పనులు చేపడుతున్న కనీసం చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావునిస్తుందని అన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతు నిర్మాణం చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గంగాధర్ కోరారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీని అవినీతిమయం చేసిన ఆ ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పందనలో జివియంసి నగర మేయర్, కమీషనర్ లను జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ కలిసి సోమవారం ఫిర్యాదు చేశారు. పెదవాల్తేర్ జాలరిపేట ఆదర్శ గ్రామంలో టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు,అవినీతిపై విచారణ చేయాలని కోరారు. ఆదర్శ గ్రామంలో నిర్మించిన 120 ఇళ్లలో 72 ఇళ్లను గతంలో ప్రభుత్వం కేటాయించిన వారికే ఇచ్చారని, నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు టిడ్కో లబ్ధిదారులు ఎలా అయ్యారన్నారు.జీవీఎంసీ యుసిడి పిడి పాపినాయుడు అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. సిఓ ఉద్యోగాలిప్పిస్తామని ఆర్పీల దగ్గర నుంచి లక్షల్లో లంచాలు తీసుకున్నారని, జైల్ రోడ్ లో నైట్ ఫుడ్ కోర్టులు రద్దు చేయాలని ఆదేశాలిచ్చినా వాటిని కొనసాగించడం కోసం

యుసిడి పి డి పాపి నాయుడు, అదనపు కమీషనర్ వై.శ్రీనివాసరావు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు ఒకప్పుడు జివిఎంసి స్కూల్లో డ్రిల్ మాస్టర్ గా ఉండేవారని, ఉన్నతాధికారిగా ఆయన నియామకం ఎలా జరిగిందో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన తాఖీదులకు చర్యలు ఎక్కడ తీసుకున్నారని ప్రశ్నించారు.

జగనన్నకు చెబుదాం వినతులపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం లో ఈ-కేవైసీ ప్రక్రియ చాలా ముఖ్యమైన అంశమని అన్నారు. అర్జీదారుని సమస్య పరిష్కరించిన తర్వాత దీనికి సంబంధించిన ఈ-కేవేసి వివరాలను సచివాలయం మహిళ పోలీస్ అసిస్టెంట్ ద్వారా ఇంటికి వెళ్లి తీసుకోవాలని అన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎలో పెండింగ్‌లో ఉండకూడదని ఆయన చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలపై అధికారులు దృష్టి సారించి తక్షణమే పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి సమస్యకూ సరైన సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 213 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.యస్. విశ్వనాథన్, పోలీస్ అధికారులు , మున్సిపల్ అధికారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొందు జాతిపై వివక్ష తగదు

విశాలాంధ్ర - రంపచోడవరం/ దేవీపట్నం: అటవీ అధికారుల బాధిత కొందుజాతి గిరిజనులపై ఐటీడీఏ ప్రభుత్వ అధికారులు పక్షపాత వైఖరి విడనాడాలని నినదిస్తూ రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద సిపిఐ (ఎం-ఎల్) వినోద్ మిశ్రా అనుబంధ ఆదివాసి గిరిజనసంఘం నాయకత్వంలో సోమవారం ధర్నా నిర్వహించారు. 20 సంవత్సరాల క్రితం వలస వచ్చి చెరుకుంపాలెం గ్రామం రాజవొమ్మంగి అటవీ రేంజ్ అడవిలో నివసిస్తున్న కొందు జాతి గిరిజనుల 12 కుటుంబాలపై సంవత్సరం క్రితం అటవీ అధికారులు దాడి చేసి వారు నివసిస్తున్న గుడిసెలను తగలబెట్టి కొందులను బయటకు తొలగించారన్నారు. అడవి సంపద కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రభుత్వంకోట్లాది రూపాయలను దోపిడీకి గురవుతోందన్నారు. అడవినే నమ్ముకుని అడవిలో పుట్టిన గిరిజన జాతికి అడవిలో ఉండే హక్కు లేదంటూ వారి గుడిసెలను తగలబెట్టి బయటికి తరిమేశారని వారికిగిరిజన అభివృద్ధి ఐటిడిఏ అధికారులు ఉండటానికి నివాసం కల్పించలేదన్నారు.

దీనిపై జిల్లా ఐటీడీఏ అధికారులు దృష్టి పెట్టి వారికి న్యాయం జరిగేలా చేయాలని సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి నాగులపల్లి అర్జునుడు, మాడెం బాబురావు, అడ్డతీగల మండలం చెందిన డిప్పలి చిన్నబ్బాయి, తాంబేలు సన్యాసిరావు మర్రి రాంబాబు, చిక్కుడు సీతమ్మ, శ్రీధర్ లక్ష్మి, ,కిలోసత్తిబాబు, గుంట చిన్నారావు, వంతల రాజు, గిన్నిల చిన్న, కన్నోజు సింహాచలంలు కోరారు.

బస్ సౌకర్యం కల్పించండి

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండల కేంద్రానికి మరిన్ని బస్సు సౌకర్యాలు పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న విజ్ఞప్తి చేసారు. ఎస్.కోట, విజయనగరం, చోడవరం అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీసుకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్సు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసారు. గతంలో చోడవరం రెండు ప్రవేటు బస్సులు ఉండేవని ఇవి చాలకాలం నుండి నడవక పోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దేవరాపల్లి మండల కేంద్రానికి అనంతగిరి మండలానికి ఆకోని గిరిజన గ్రామాలకు ముఖద్వారం అవ్వడం అటు గిరిజనులకు ఇటు దేవరాపల్లి మండల ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. దీంతో విజయనగరం జిల్లా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంకు ప్రజలు ప్రయాణం పెరుగుతుందని

వీటికి బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా దేవరాపల్లి ప్రజలకు సౌకర్యం కల్పించడంతో దేవరాపల్లి మండల కేంద్ర అభివృద్ధికి తోడ్పడుతుందని వెంకన్న తెలిపారు.

జనసేన పార్టీ వైపు...రాష్ట్ర ప్రజల చూపు

పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర

విశాలాంధ్ర - మాకవరపాలెం: రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం జనసేన పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. ఆదివారం రాత్రి మాకవరపాలెం మండలం తాడపాల గ్రామంలో జరిగిన సమావేశంలో తాడపాలకు చెందిన మంగాళ రాజు ఆధ్వర్యంలో గరగా శ్రీను, గనిశెట్టి శివ, గనిశెట్టి చిరంజీవి, గరగా ఈశ్వరరావు, గరగా గోవిందు, జిల్లేడిపడి రాజు, పెదపూడి విజయ్, ఉగ్గిన బాల శ్రీనివాస్, జిల్లేడిపూడి దేవుడమ్మ తదితర 50 మంది వైసిపి కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా సూర్యచంద్ర వీరందరికి జనసేన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలంతా జనసేన వైపు చూస్తున్నారనడానికి ఈ చేరికలే కారణమన్నారు. జనసేన సిద్ధాంతాలు, పవన్‌కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో భారీగా చేరుతున్నారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీ రోజురోజుకు పుంజుకుంటుందన్నారు. తాడపాల గ్రామంలో ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. గ్రామంలో పంచాయతీకి కరెంట్ బిల్లులు కట్టకపోవడంతో ఎనిమిది రోజులుగా గ్రామస్థులకు నీటి సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామానికి సంబంధించి ఆయకట్టు లీకేజీల కారణంగా వరినాట్లు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. దీనికి కనీస మరమ్మత్తులు చేయలేని దుస్థితిలో పాలకులు ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రభంజనం సృష్టించడ ఖాయమని, పార్టీలో చేరిన వారంతా జనసేన పార్టీ

బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల నాయకులు సేనాపతి శేషు, కర్రి సురేష్, కర్రి సంతోష్, నమ్మి మంగరాజు, నమ్మి రమణాజు, సప్పా నానాజీ, చిరంజీవి, మాకవరపాలెం మండల మహిళా నాయకులు లోకున జ్యోతి, నర్సీపట్నం పార్టీ నాయకులు అద్దేపల్లి గణేష్, పూడి చక్రవర్తి, పినపోతుల నాగు, కొత్తకోట రామశేఖర్, మారిశెట్టి రాజా, నాతవరం మండల యూత్ అధ్యక్షులు బైన మురళీ, మాకిరెడ్డి వెంకట రమణ, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ గిరిజన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: వివిధ శాఖల్లోని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానం ద్వారా విధులు చేపడుతున్న గిరిజన ఉద్యోగులకు తక్షణమే పర్మినెంట్ చేయాలని టీఎస్‌టీయూసీ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మండ్య గురు స్వామి ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. గిరిజన ప్రాంతంలోని సుమారుగా 15 నుండి 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో వీఆర్‌పి, వెలుగులో సీసీలుగా, గిరిజన ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య, కస్తూరిభా గాంధీ, అలాగే గురుకులంలో సి ఆర్ టి లుగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. వీటితోపాటు వర్కర్లు, వాచిమేన్లు, విద్యుత్ శాఖ లో లైన్మెన్ లుగా పనిచేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కాఫీలో లైజన్ వర్కర్స్, ఎంహెచ్డబ్ల్యూ (పురుషులు) అంగవాడిలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిహెచ్ డబ్ల్యు లు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో అధికారం వచ్చిన తక్షణమే ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు వేతనాలు పెంచుతామని ప్రగల్భాలు పలికిన వైసీపీ ప్రభుత్వం అధికార పగ్గాలు వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆయన పేర్కొన్నారు.

శ్రీ దుర్గా మహిళా సేవా సంఘం వార్షికోత్సవం

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ పద్మనాభ నగర్ శ్రీ దుర్గా మహిళా సేవా సంఘం 25వ వసంతోత్సవం జరుపుకుంది. మహిళలు సమాన హక్కుల కోసం, మెరుగైన జీవితం కోసం ఉద్యమించిన రోజులు . నేడు అన్ని రంగాల్లోనూ ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తూ దూసుకుపోతూ , విభిన్న రంగాల్లో వనితలు రాణిస్తున్నారు. శ్రీ పద్మనాభ నగర్ దుర్గా మహిళా సేవా సంఘం వారే అని పద్మనాభ నగర్ మహిళా మండలి గౌరవ అధ్యక్షులు, వృక్ష మిత్ర అవార్డు గ్రహీత నందవరపు సోములు అన్నారు. జీవీఎంసీ 92 వ వార్డు పద్మనాభనగర్ గ్రామంలో పద్మనాభనగర్ మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళా సేవా సంఘం స్థాపించి 25వ వసంతోత్సవంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన నందవరపు సోములు ప్రసంగించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు కట్ట కనకలక్ష్మి మాట్లాడుతూ గడచిన 25 సంవత్సరాలుగా మా మహిళా మండలి వారు ఓవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే, మరోవైపు తాము ఎంచుకున్న వృత్తి వ్యాపార రంగాలలో రాణిస్తున్నారన్నారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని మహిళ సంఘ సభ్యులకు, గ్రామస్తులకు వరలక్ష్మి దేవి చరిత్ర, పూజా విధానం మొదలగు ఆధ్యాత్మిక దేవతల చరిత్ర గల పుస్తకాలను నందవరపు సోములు చేతుల మీదగా పంపిణీ చేశారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయాలి



విశాలాంధ్ర - దుంబ్రిగుడ: రాజ్‌మా చిక్కుడు విత్తనాలను రైతులకు వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం పార్టీ గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజ్‌మా విత్తనాలు సకాలంలో రైతులకు పంపిణీ చేయకపోవడంతో ఒరిస్సా ఇతర ప్రాంతాల్లో అధిక ధరలు వెచ్చించి రైతులు ఆయన కొనుగోలు చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సిపిఎం నాయకులు సీజన్ దాటిపోతున్న ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చే సబ్సిడీ విత్తనాలు సకాలంలో అందించకుండా నిర్లక్ష్యం చేయడం సరి కాదని అన్నారు. సీజన్ దాటినా తర్వాత విత్తనాలు పంపిణీ చేయడం వలన రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదని, ఒకవేళ సాగుచేసిన రైతులు నష్ట పోయే అవకాశం ఉందని చెప్పారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని సంతలో దళరులు అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నారని చెప్పారు. సకాలంలో విత్తనాలు పంపిణీ చేయకపోతే రైతులతో ఆందోళన చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల నాయకుడు పాంగి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొయ్యూరు: బాలల హక్కుల ఉల్లంగనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం హెచ్చరించారు. అల్లూరి జిల్లా పర్యటనలో భాగంగా కొయ్యూరు మండలంలో సోమవారం పర్యటించిన ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గత మూడేళ్లుగా జరిగిన శిశు మరణాలు, ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు జరిగిన శిశు మరణాలపై వైద్యులు ఎం.సంపత్ బాబు, జే.మనోజ్ఞలను అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంతమంది పిల్లలు వైద్యం పొందారు, వారిలో పౌష్టికాహార లోపం, తక్కువ బరువు, సికిల్ సెల్ ఎనీమియా, రక్తహీనత వల్ల వచ్చిన పిల్లలెంతమంది, దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్సకొచ్చిన పిల్లల వివరాలు, మెరుగైన వైద్యం కోసం ఎంతమందిని ఇతర ఆసుపత్రులకు తరలించారు వారి వివరాలు, ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు వారిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వార్డు సచివాలయాల ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ఎంత మంది తదితర అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల హక్కుల్లో భాగంగా తల్లి గర్భం దాల్చిన నాటినుండి జన్మనిచ్చినంతవరకు పౌష్టికాహారాన్ని ఎంతో బాధ్యతా యుతంగా అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్నప్పటికీ శిశు మరణాలు సంభవిస్తుండడం విచారకరమని అన్నారు. ఈ మరణాలకు తల్లిదండ్రుల అవగాహన లోపమా లేక వైద్య ఆరోగ్య శాఖాధికారులు అంగన్వాడీ సిబ్బంది నిర్లక్ష్యమా అన్న దానిపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో నివేదికలు తెప్పించుకునే క్రమంలో ఉన్నామని అన్నారు. వీటిలో సిబ్బంది నిర్లక్ష్యం బహిర్గతమైతే అధికారులు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నామన్నారు, బాలల హక్కుల ఉల్లంఘనలుకు పాల్పడే వ్యక్తులను, వ్యవస్థలను ఉపేక్షించేదిలేదని సీతారాం హెచ్చరించారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ తిరుమలరావు, ఎంపీడీఓ సీతయ్య, సిడిపిఓ విజయకుమారి, సూపర్ వైజర్ సునీత, మంప ఎస్సై లోకేశ్ కుమార్, ఎంఈఓ బోడంనాయుడు, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అల్లూరి జిల్లా కన్వీనర్ బాకా లవకుశ, కొయ్యూరు మండల కన్వీనర్ పి.అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో గుంతలు లేని రోడ్లు లేవు

టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ ఈశ్వరి

విశాలాంధ్ర - జీకే వీధి: రహదారుల కల్పనలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరే పాడేరు ఘాట్ రోడ్‌లో బస్సు ప్రమాదానికి కారణమని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. పాడేరు ఘాట్ రోడ్ లో ఆదివారం చోటు చేసుకున్న బస్సు ప్రమాద ఘటనలో గాయపడి విశాఖలోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆమె సోమవారం పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రహదారుల దుస్థితి దయనీయంగా తయారయిందన్నారు. గుంతలు లేని రోడ్లు లేవన్నారు. ఘాట్ రోడ్లు సైతం గతుకుల మయంగా మారడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే నూతనంగా నిర్మించిన రహదారులలో సైతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. పది రోజుల క్రితం ఎర్ర బంద, శరభనపాలెం రహదారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ అరకు పార్లమెంట్ సభ్యురాలు మాధవి సోదరుడు తీవ్రంగా గాయపడిన విషయం మరువకముందే పాడేరు ఘాట్ రోడ్లో ఇంతటి ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకోవడం వైకాపా ప్రభుత్వ వైఫల్యం అన్నారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం, పదుల సంఖ్యలో తీవ్ర గాయాల పాలై ఆసుపత్రులలో చేరడం బాధాకరమన్నారు. గాయపడిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించి మెరుగైన వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బస్సు ప్రమాదంలో మృత్యుంజయురాలిగా ఉన్న చిన్నారిని ఎత్తుకొని ఆ చిన్నారి తల్లిదండ్రుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఓటర్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్‌పై శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్షులు కూన రవి కుమార్ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇంచార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ వెరిఫికేషన్ మరియు హౌస్ మేపింగ్ లు ఉమ్మడి విశాఖ జిల్లాలో కొనసాగుతున్న విధానంపై చర్చించారు. బి ఎల్ ఓ లు ఓట్లు అనుసంధానం చేయు విధానం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు , ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జి గండి బాబ్జీ, అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబ , భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ కోరాడరాజబాబు, మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జి పి వి జి కుమార్ , ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగాఢ నాగేశ్వరరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్చార్జి విజయ బాబు, మాజీ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు రాజమండ్రి నారాయణ, ఇతర నియోజకవర్గాల ఇన్చార్జి లు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు 108 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని, "జగనన్నకు చెబుదాం"కు 108 అర్జీలు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె జీవిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో "జగనన్నకు చెబుదాం(స్పందన)" కార్యక్రమంలో కమిషనర్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ "జగనన్న కు చెబుదాం" లో మొత్తం 108 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో ఒకటవ జోన్ కు 01, రెండవ జోన్ కు 17, మూడువ జోన్ కు 16, నాల్గవ జోన్ కు 11, ఐదవ జోన్ కు 11, ఆరువ జోనుకు 13, ఎనిమిదివ జోన్ కు 11, జీవిఎంసి ప్రధాన కార్యాలయానికి 28 ఫిర్యాదులు, మొత్తం 108 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో పరిపాలన %ు% అక్కౌంట్స్ కు 5, రెవెన్యూ కు 18, పబ్లిక్ హెల్త్ కు 7, టౌన్ ప్లానింగ్ కు 47, ఇంజినీరింగ్ కు 19, హార్టికల్చర్ కు 4, యుసిడి కు 8 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఆ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న "జగనన్న కు చెబుదాం" కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరిస్తున్న వినతులు, సలహాల అంశాలపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలతో కూడిన సమాచారంతో..., తరువాత వారం వచ్చే "జగనన్న కు చెబుదాం" కార్యక్రమానికి ముందుగా సమర్పించవలసిన వివరాలుతో ఆయా విభాగాధిపతులు సిద్ధం చేయాలని కమిషనర్ తెలిపారు. ఆయా వివరాలను తరువాత వారంలో సమర్పించడం వలన నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాస రావు, డాక్టర్ వి సన్యాసి రావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, సిసిపి సునీత, సిఎంఓహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, డిసిపి నరేంద్ర రెడ్డి, కార్యదర్శి పి నల్లనయ్య, డిసి(రెవెన్యు) ఫణిరామ్, డిడి(హార్టికల్చర్) దామోదర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవ రావు, ఎఫ్.ఎ ఎ.ఓ మల్లికాంబ, డిపిఓ చంద్రిక, పిఓ(యుసిడి) సూర్య కళ, పర్యవేక్షక ఇంజినీర్లు సత్యనారాయణ రాజు, వినయ్ కుమార్, కృష్ణారావు, రామ్మోహన్ రావు, శ్యాంసన్ రాజు, డిపిఓ చక్రధర్, డిఇఓ శ్రీని వాసు, డిసిపిలు, ఎసిపిలు, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా డ్రైనేజీ వ్యవస్థ పనులు

విశాలాంధ్ర - తగరపువలస: టి.నగరపాలెం కొత్తూరు గ్రామంలో సిమెంట్ రోడ్ ప్రక్కన గత ప్రభుత్వం లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లోపాలతో చాలా చిన్న పైపులు వేయిటము వలన మురికి కాలువ పూడికలు తీయలేక నీరు జామ్ అయి మురికి నీరు నిల్వ ఉండటం వల్ల అపరిశుభ్రంగా వుండటం గమనించి స్థానిక సర్పంచ్ పోట్నూరు చంద్రశేఖర్ చాయ గౌతమి ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ పనులకు శ్రీకారం చుట్టారు. గడప గడపకు వైఎస్సార్ నిధులతో సుమారు ఇరవై లక్షలతో గొల్లవీధి కొండ ప్రక్కన ఓపెన్ డ్రైనేజీ, కొత్తూరు గ్రామంలో సిమెంట్ కాలువలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఓపెన్ కాలువ డ్రైనేజీ వ్యవస్థ వలన భవిష్యత్తులో ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూడికలు బ్లీచింగ్ చేసి పరిశుభ్రంగా చేసి, ప్రజలు ఆరోగ్యం సంరక్షణ చేయిటమే మా ముందున్న లక్ష్యం అన్నారు. గ్రామం లో ఎటు వంటి సమస్యలు లేకుండా చేయిటమే మా ఆశయం అని వివరించారు. ఈ కార్యక్రమంలో భీమునిపట్నం మండలము ప్రజా పరిషత్ అధ్యక్షులు వాసురాజు, ఎంపీటీసీ సభ్యులు పల్ల నీలిమ, సన్యాసిరావు, 5వ వార్డు మెంబర్ తమ్మిన నరేంద్ర, వైయస్సార్ పార్టీ అధ్యక్షులు బాయిన మంగరాజు, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించండి

పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అల్లూరి సీతారా మరాజు జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, కెజిబివి అధికారులు, ఐటిఐ ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో పూర్తి స్థాయిలో జె.వి.కె కిట్లు విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు రాకుండా హాజరు నమోదు చేస్తున్నారని, విద్యార్థులు పాఠశాలకు రాకపోయినా కొన్ని చోట్ల హాజరు నమోదు చేస్తున్నారని అటువంటి విధానాన్ని విడనాడాలని సూచించారు. మన బడి నాడు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠ్య ప్రణాళికలు అమలుపై మండల విద్యాశాఖాధికారులకు అవగాహన ఉండాలని చెప్పారు. 10 వ తరగతి పాసైన విద్యార్థులు ఎంత మంది కళాశాలలు, ఐటిఐ చేరారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐటిఐ పాసైన విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. పాఠశాలల్లో బినామీ ఉపాధ్యాయులుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్యాపక పోస్టులు భర్తీ

ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్ గౌర్ మాట్లాడుతూ అంకితభావంతో చదువులు చెప్పాలని అధ్యాపకులకు సూచించారు. జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 13,227 మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ విధానంలో భర్తీ చేస్తామని చెప్పారు. 10 వతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు జూనియర్ కళాశాలలో ప్రవేశం కల్పించాలని స్పష్టం చేసారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ 1.66 లక్షల మంది విద్యార్థులకు జె వి కె కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 21 వేల మంది విద్యార్థులను కొత్తగా పాఠశాలలో చేర్పించారని అన్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఐటిడిఏ పి ఓ సూరజ్ గనోరే, డి ఇ ఓ సలీంభాషా, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండల రావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతి కుమారి, జిల్లా లోని ఎం ఇ ఓలు ప్రిన్సిపాల్స్, కెజిబివి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

158వ స్టోర్‌ను ప్రారంభించిన రాయల్ ఓక్

విశాలాంధ్ర -విశాఖ సిటీ: భారతదేశంలోని ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ రాయల్ ఓక్ ఫర్నిచర్, ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం లో తన 158 వ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. ఈ స్టోర్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మరికొంతమంది అతిధుల సమక్షంలో లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయల్ ఓక్ ఫర్నిచర్ ఛైర్మన్ విజయ్ సుబ్రమణియం, మేనేజింగ్ డైరెక్టర్ మథన్ సుబ్రమణియం, ఫ్రాంచైజ్ హెడ్ కిరణ్ చాబ్రియా, డిజిటల్ మార్కెటింగ్ హెడ్ జై ప్రకాష్ గిరి , ఫ్రాంచైజ్ మేనేజర్ బత్తిన శివ కుమార్ , రాయల్ ఓక్ ఎం ఎస్ ఓ డిప్యూటీ జి ఎం తమ్మయ్య పాల్గొన్నారు. దాదాపు 14000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్ విస్తృత శ్రేణిలో లివింగ్ రూమ్స్, బెడ్‌రూమ్స్, డైనింగ్ రూమ్స్ లకు సరిపడే ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. సోఫాలు, రిక్లైనర్స్, డైనింగ్ టేబుల్స్, మ్యాట్రెసస్, బెడ్స్, ఇంటీరియర్ డెకార్ సమగ్ర శ్రేణి ఆఫీస్, ఔట్ డోర్ ఫర్నిచర్ తో సహా అనేక రకాల స్టైలిష్ వస్తువులు అందుబాటులో ఉంచారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో రాయల్ ఓక్ యొక్క 8వ స్టోర్ అని స్టోర్ ప్రతినిధులు చెప్పారు.

నగరానికి చేరుకున్న అశోక్ లేలాండ్ డ్రీమ్ డ్రైవ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అశోక్ లేలాండ్ యొక్క 75 ఏళ్ల వేడుకను పురస్కరించుకుని చేస్తున్న ' డ్రీమ్ డ్రైవ్' లో భాగంగా అశోక్ లేలాండ్‌కు చెందిన బడా దోస్త్ పార్టనర్ సూపర్ 914 వాహనాలు వైజాగ్ కు చేరుకున్నాయి. కోల్‌కతా నుండి ప్రయాణం చేస్తూ వైజాగ్ కు చేరుకున్న ఈ వాహనం విజయవాడ వైపు వెళుతుంది. ఈ డ్రైవ్ హెూసూర్ వద్ద నున్న తయారీ కర్మాగారంలో ముగుస్తుంది. ఈ ప్రయాణంలో హైదరాబాద్ , కర్నూలు, ఒంగోలు, కృష్ణగిరి, కడపలను కూడా కవర్ చేస్తుంది. మొత్తం 10 వాహనాలతో ప్రారంభమైన ఈ డ్రీమ్ డ్రైవ్ ఐదు వేర్వేరు మార్గాల్లో దేశం యొక్క నలుమూలలా ప్రయాణిస్తోంది. బెంగళూరు, ముంబయి, జమ్మూ, కోల్‌కతా మరియు దిబ్రూగఢ్‌ల నుండి ప్రారంభమయ్యే ఈ డ్రైవ్ దేశవ్యాప్తంగా కీలకమైన ప్రదేశాలలో ప్రయాణిస్తుంది మరియు అశోక్ లేలాండ్ తయారీ ప్లాంట్లలో ముగుస్తుంది. దేశంతో సంస్థ యొక్క శాశ్వత సంబంధాన్ని అనేక కోణాలలో వేడుకగా జరుపుకోవడం ఈ డ్రైవ్ లక్ష్యం అని, డ్రీమ్ డ్రైవ్' గురించి తాజా సమాచారం కోసం డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు డాట్ అశోక్ లేలాండ్ డాట్ కామ్ ను సంప్రదించాల్సిందిగా ఆ సంస్థ ప్రతినిధి కోరారు.

కూతురిపై అత్యాచారానికి పాల్పడిన తండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష....

10 లక్షల నష్ట పరిహారం విధించిన గౌరవ విశాఖపట్నం స్పెషల్ పోక్సో

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం; కూతురిపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పు, నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించిన న్యాయస్థానం.బాధితులకు నాయ్యం జరిగే లాగా దిశ చట్టం స్పీడ్ ట్రయల్ కి ఉపయోగ పడిందని స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ అభిప్రాయపడ్డారు. సోమవారం విశాఖపట్నం గౌరవ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఆనంది విచారణ ముగిసిన తర్వాత ముద్దాయికి పత్రా రామచంద్రరావు కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా బాధితురాలికి 10 లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించడం జరిగినది. 2020వ సంవత్సరంలో మల్కాపురం %చీ=% కాలనీలో కూతురిపై అత్యాచారానికి ఒడిగట్టిన కేసులో గౌరవ కోర్టు వారు పై సంచలన తీర్పు విధించడం జరిగినది. పై కేసు నందు కన్విక్షన్ పడుట లో ప్రతిభ కనబరిచిన స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ గారిని, కేసు ట్రయిల్ జరడంలో పురోగతి చూపించిన నగర పోలీసు అధికారులను, కోర్టు కానిస్టేబుల్ %ఔెుజ% 2920 ఆర్. పైడితల్లి గారినీ నగర పోలీసు కమిషనర్ డా.సి.యం. త్రివిక్రమ వర్మ,ఐ.పి.ఎస్.,గారు అభినందించడం జరిగింది , కోర్టు ట్రైల్స్ నందు విశేష సేవలు అందించినందుకు గాను అభినంధించి, గౌరవ డి.జి.పి గారి అదేశాలను అనుసరించి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న ప్రయారిటీ కేసుల నందు కోర్టులో ట్రయిల్ కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ఉన్నతాధికారులు ప్రతీ కేసును కన్విక్షన్ పడే వరకూ పూర్తి మోనటరింగ్ చేయాలని, ప్రతీ ఉన్నతాధికారి 5 కేసులు మోనటరింగ్ చేసే విధముగా అదేశాలు ఇచ్చామనీ ,కేసుల విషయం లో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్స్పెక్టర్ల తో మాట్లాడుతూ ఉండాలని, ఎక్కువ కేసులు గల రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ పై నిరంతరం దృష్టి పెట్టాలని తెలిపారు, ప్రతీ నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్య మునుపటి నెలతో పోల్చినప్పుడు పెరుగుదల కనిపించాలని తెలిపారు.

వై జంక్షన్‌ను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం వై జంక్షన్ బ్రిడ్జి పైన సోమవారం పోలీస్ ఉన్నతాధికారులు , డిసిపి విద్యాసాగర్ నాయుడు, ఏ డి సి పి శ్రీనివాసరావు, ఏసిపి జాన్ మనోహర్ పలు అధికారులు పర్యవేక్షణ చేశారు. వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేయాలని సూచించారు. ఇందులో భాగంగా విజయనగరం నుంచి వచ్చే వాహనాలు ఆనందపురం బ్రిడ్జి పైన వై జంక్షన్ దగ్గర కొంతమంది వాహనదారులు వైజాగ్ వెళ్ళవలసి ఉండగా వాళ్లు అనకాపల్లి రూట్ ను మార్గం రాంగ్ రూట్లో వెళ్లి గుండా వెళ్లి మరల రాంగ్ రూట్ అని వెనక్కి వచ్చి విశాఖపట్నం వెళ్ళవలసి వస్తుంది. వాహనదారులను సమస్యలను దృష్టిలో పెట్టుకొని జంక్షన్ వద్ద బోర్డు ఏర్పాటు చేసి సలహాలు సూచనలు చేశారు తదుపరి బ్రిడ్జి పైన రోడ్డు నేషనల్ హైవే ను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులతో పాటు ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి .రామచంద్రరావు, ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంకిపాటి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు కంకిపాటి వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు పాయకరావుపేటలో తెలుగుదేశం పార్టీ నాయకులు సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, యాళ్ళ వరహాల బాబు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, చింతకాయల రాంబాబు, బొంది కాశీ విశ్వనాథ్, దేవవరపు వెంకట్రావు, పల్లా విలియం కేరి, కసింకోట సత్తిబాబు, జూరెడ్డి ప్రసాద్, కట్టా శ్రీను, గుల్లా నాగరాజు, చిరుకూరి వీర్రాజు, వేములపూడి అప్పారావు, దువ్వి శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

విశాలాంధ్ర - సీలేరు: సీలేరు నుంచి విశాఖ వెళుతున్న నైట్ హాల్ట్ బస్సు సాంకేతిక లోపం వలన మండలంలోని దుశ్చర్యపాలెంలో ఆగిపోయింది. అక్కడ రెండు గంటలు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అనంతరం అక్కడ నుంచి బయలుదేరి చింతపల్లి దాటిన తర్వాత టైరు పంచర్ అయిపోయి అక్కడ ఒక మూడు గంటలు అయింది. ఘాట్ రోడ్డులో పాత సర్వీసులు వేయడంతో తరచూ సాంకేతిక సమస్యలతో ఆగిపోతున్నాయి. ఘాటీ రోడ్డు సర్వీస్‌కి మంచి బస్సులు వేయాలని సీలేరు, దారకొండ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వాగు, గోర్జు స్థలాలకు ఎల్‌పీసీలు మంజూరుపై ఫిర్యాదు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం పంచాయతీ రెవెన్యూ పరిధిలో గల 66-11, 67, 68, 69, 84/1, 85 సర్వే నెంబర్లు గల వాగు, గోర్జులలో స్థానిక అధికార పార్టీ నాయకులు, కొంత మందితో కలిసి ముడుపులు తీసుకొని ఆయా స్థలాలుకు ఎల్‌పిసిలు మంజూరు చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని, కావున పంచాయతీలో ప్రభుత్వం భూమి అయిన గెడ్డ, పోరంబోకు, గోర్జులలో గల అధిక విలువ గల స్థలాలను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సర్పంచ్ అల్లంపల్లి శిరీషా సోమవారం జిల్లా కలెక్టర్ రవిపట్నాన్‌శెట్టికి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లాలం రాము పాల్గొన్నారు.

రోడ్‌సైడ్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్న టీకేఎం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకేఎం) నూతన పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. దీనిలో భాగంగా కొత్త వాహనం కొనుగోలు చేసిన తేదీ నుండి 5 సంవత్సరాల పాటు కాంప్లిమెంటరీ రోడ్‌సైడ్ అసిస్టెన్స్ అందించనున్నారు. ఈ మార్గదర్శక కార్యక్రమం తమ విలువైన కస్టమర్లకు సౌకర్యవంతమైన యాజమాన్య అనుభవాన్ని అందించడంలో టయోటా యొక్క నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందన్నారు. ఈ ఆర్ ఎస్ ఏ ప్యాకేజీ బ్రేక్‌డౌన్ మద్దతు గురించి మాత్రమే కాదనీ, ఇది ప్రతి టయోటా యజమానికి భరోసా, సౌలభ్యం భద్రతా భావాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా కస్టమర్‌లు ఉత్పత్తులను మాత్రమే కాకుండా, టయోటా యొక్క ప్రపంచ-స్థాయి నాణ్యత, మన్నిక, విశ్వసనీయత సేవలను సకాలంలో, సాటిలేని రోడ్‌సైడ్ సహాయాన్ని కవర్ చేస్తున్నామని చెప్పారు

పీవీటీజీ సర్వే త్వరగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - చింతపల్లి : - పీవీటీజీ ల సర్వే త్వరగా పూర్తి చేసేలా సచివాలయ సిబ్బంది పని చేయాలని ఎంపీడీవో ఆశాజ్యోతీ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవీటీజీల వివరాలు త్వరగా సేకరించి తమకు నివేదిక ఇవ్వాలని, సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకోవలసి వస్తుందన్నారు. అలాగే ప్రతి రోజు మూడు పూట్ల బయోమెట్రీక్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి కొరుప్రోలు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.